## క్లుప్తంగా

### కార్మికులకు అండగా ఉంటాం



కార్మికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

జగిత్యాల: కార్మికులకు ఎప్పుడూ అండగా ఉంటామని, తడి, పొడి చెత్త వేరుగా సేకరించాలని, పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. బుధవారం కార్మికుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల కొరత లేకుండా చూడాలని, కార్మికుల కొరత ఉంటే దృష్టికి తీసుకురావాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని, వర్షాకాలం కాబట్టి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని, కార్మికులు ఏ సమస్యలున్నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఆమె వెంట శానిటేషన్ అధికారులు ఉన్నారు.

### బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి



తాత్కాలిక రోడ్డును పరిశీలిస్తున్న నర్సింగరావు

ఇబ్రహీంపట్నం: బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కాంట్రాక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని యామాపూర్, ఫకీర్‌కొండాపూర్ వెళ్లే వాగు వద్ద నిర్మిస్తున్న తాత్కాలిక రోడ్డు తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. ఆయన పరిశీలించి, వెంటనే రాకపోకలను పునరుద్ధరించేందుకు తాత్కాలిక రోడ్డును మరమ్మతు చేయాలని కోరారు. అనంతరం తిమ్మాపూర్‌లో మాజీ ఎంపీపీ నేరేళ్ల దేవేందర్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బాస శ్రావణ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుదిగాం గంగాధర్, కిషాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### చివరి దశకు ఎస్సీ వర్గీకరణ పోరాటం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జగిత్యాలటౌన్: 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ పోరాటం చివరి దశకు చేరుకుందని, గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ కమిటీల నిర్మాణం చేపట్టి, జెండా ఆవిష్కరణలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం మాదిగ కోరారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో పట్టణ అధ్యక్షుడు బొల్లారపు దివాకర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మందకృష్ణ ఆదేశాల మేరకు గ్రామగ్రామాన అన్ని అనుబంధ సంఘాల సంస్థాగత కమిటీల నిర్మాణం చేపట్టాలని, ప్రతి గ్రామంలో జెండా గద్దెలు నిర్మించి పార్టీ జెండాలు ఆవిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్‌పల్లి లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

### 'స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి'

జగిత్యాలటౌన్: దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఐఏఎస్ స్మితాసబర్వాల్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని జిల్లా దివ్యాంగుల సంఘం నాయకులు అజ్గర్ మహ్మద్‌ఖాన్ డిమాండ్ చేశారు. జగిత్యాలలో బుధవారం మాట్లాడారు. పార్లమెంట్‌లో ఆమోదం పొందిన దివ్యాంగుల హక్కుల చట్టం 2016 సెక్షన్ 92 ప్రకారం దివ్యాంగులు పొందుతున్న రిజర్వేషన్ రద్దు చేయాలనడం ఆమె స్థాయికి తగదన్నారు. దివ్యాంగులను హీనులుగా చిత్రీకరించేలా స్మితా సబర్వాల్ మాటలను వెనక్కు తీసుకుని బహిరంగ క్షమాపణలు చెప్పాలని లేనిపక్షంలో జిల్లా కలెక్టరేట్ల ఎదుట పెద్దఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట దివ్యాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు లంక దాసరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### టీపీఎస్‌గా ప్రవీణ్

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా ప్రవీణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పనిచేస్తున్న టీపీఎస్ తేజస్విని బదిలీపై కరీంనగర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా తేజస్వినిని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి సత్కరించారు.

# వ్యాధుల కాలం.. అందని మందులు

- శిథిలావస్థలో పశువైద్య భవనాలు
- వెక్కిరిస్తున్న పోస్టుల ఖాళీలు



శిథిలావస్థలో మూటపల్లి పశువైద్య భవనం

రాయికల్: వర్షాకాలం ప్రారంభమైందంటేనే గొర్రెలు, మేకల్లో కుంట్లుపట్టడం,నోటి పుండ్లు వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. రోగాలకు సరిపడా మందులు లేక యాదవ రైతులు ప్రైవేట్ మెడికల్ షాపుల వైపు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సిన మందులు మూడు నెలలుగా మంజూరు కాకపోవడంతో యాదవ, పాడి రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఆస్పత్రిలో పశువైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి.

**శిథిలావస్థలో భవనాలు... వెక్కిరిస్తున్న ఖాళీలు**

రాయికల్ మండలంలోని భూపతిపూర్, మూటపల్లి సబ్‌సెంటర్లలో ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ రెండు సబ్‌సెంటర్లలోని భవనాలు వర్షపు నీరు ఆస్పత్రిలోకి రావడంతో ఆస్పత్రిలో మందులు సైతం వర్షానికి నానిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మండలంలో అల్లీపూర్, రాయికల్ ఆస్పత్రులు ఉండగా, భూపతిపూర్, మూటపల్లి సబ్‌సెంటర్లున్నాయి. అల్లీపూర్ ఆస్పత్రిలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(వీఏఎస్) పోస్టు, అటెండర్ ఖాళీగా ఉండటంతో జగిత్యాల రూరల్ మండలం మోరపల్లికి చెందిన డాక్టర్ నరేశ్‌రెడ్డి అడిషనల్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. భూపతిపూర్, మూటపల్లిలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండటంతో భూపతిపూర్‌కు ఉప్పుమడుగులో పనిచేస్తున్న ఖలీద్‌ను అడిషనల్ చార్జిగా, రాయికల్ ఆస్పత్రిలో వీఏగా పనిచేస్తున్న రమణను మూటపల్లికి ఇన్‌చార్జిగా నియమించారు.

**మూడునెలలుగా జాడలేని మందులు..**

రాయికల్ ఆస్పత్రిలో ఇటు వీఏఎస్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండటంతో పాటు, మూడునెలలుగా ప్రభుత్వం నుంచి మందులు మంజూరు కావడం లేదు. వర్షాకాలంలో ముఖ్యంగా గొర్రెలు, మేకలకు గాలికుంట్లు వ్యాధులు రావడంతో వాటి నివారణ కోసం పంపిణీ చేయాల్సిన జ్వరం, నొప్పులు, పెన్సిలిన్, పురుగుల మందు మంజూరు చేయాల్సి ఉండగా నేటి వరకు ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో రైతులు ప్రైవేట్ మెడికల్ షాపులకు వెళ్లి మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగాలు ప్రబలే సమయంలో మందులు మంజూరు చేయక, ఇతర సమయాల్లో అందజేస్తే ఫలితం లేకుండా పోతుందని యాదవ రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఖాళీగా ఉన్న ఎల్ఏఎస్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ల పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

### మందులు పంపిణీ చేయాలి



వర్షాకాలంలో గొర్రెల్లో ఎక్కువగా వ్యాధులులు ప్రబలే అవకాశం ఉన్నందునా ప్రభుత్వం స్పందించి యుద్ధ ప్రాతిపదికన ప్రతి యాదవ రైతుకు మందులు పంపిణీ చేయాలి. మండలంలో శిథిలావస్థలో ఉన్న భవనాలకు పక్కా భవనాలు నిర్మించాలి. – వాసరి రవియాదవ్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు

### ఉన్నతాధికారులకు నివేదించాం



రాయికల్ మండలంలోని అల్లీపూర్‌లో వీఎస్ఏ, మూటపల్లి, భూపతిపూర్‌లో ఎల్ఎస్ఏ పోస్టుల ఖాళీలతో పాటు, భూపతిపూర్, మూటపల్లిలో శిథిలావస్థలోఉన్న భవనాలపై ఉన్నతాధికారులకు నివేదించాం.

– శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి

## నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రావణి, నాయకులు

జగిత్యాలటౌన్: పట్టణంలోని సీ టైప్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని, ఇళ్లను కేటాయించిన తర్వాతనే క్వార్టర్స్‌ను ఖాళీ చేయించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రెండు రోజుల క్రితం ఎస్సారెస్పీ అధికారులు వచ్చి క్వార్టర్స్ ఖాళీ చేయాలని చెప్పడంతో ఆ క్వార్టర్స్‌లో ఉంటున్న పేదలు ఆందోళన చెందుతున్నారని, క్వార్టర్స్ ఖాళీ చేసి ఎక్కడికి వెళ్లాలని ఆందోళన చెందుతున్నారన్నారు. వారికి నూకపెల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఇళ్ల కేటాయించాలని కోరారు. ఆమె వెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు రంగు గోపాల్ నాయకులు వీరబత్తిని అనిల్‌కుమార్, ఆముద రాజు, గడ్డల లక్ష్మి తదితరులు ఉన్నారు.

## బాధితుడికి ఎమ్మెల్యే సంజయ్ పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: పట్టణానికి చెందిన కోటగిరి చంద్రోఖర్ ప్రమాదవశాత్తు గాయపడి హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జగిత్యాల వైశ్య సంఘం అధ్యక్షుడు మంచాల కృష్ణ ఉన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న లక్ష్మణ్, సంక్షేమాధికారి నరేశ్

జగిత్యాలజోన్: మహిళల హక్కులు, చట్టాల గురించి మహిళా సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం తీసుకవచ్చిన పోక్సో, గృహహింస, 498–ఏ చట్టాలు, మహిళలు హక్కులు, తల్లితండ్రుల భాద్యతల గురించి న్యాయవాదులు వివరించారు. ఆడపిల్లను చదివించాలని, ఉద్యోగాలు వచ్చే వరకు పెళ్ళిళ్ల ఆపేయాలని, ప్రతి మహిళకు ఆర్థిక స్వాతంత్ర్యం రావాలని మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేశ్, సీడీపీవోలు వాణిశ్రీ, నర్సింగారాణి, వీరలక్ష్మి, మహిళా సాధికారిత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ అశ్విని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి, సీనియర్ న్యాయవాది బెత్తపు లక్ష్మన్, కేంద్రం నిర్వాహకులు గౌతమి, స్వప్న, హేమ శ్రీ, వికలాంగుల శాఖ ఎఫ్ఆర్‌వో కొండయ్య పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ అశ్విని

జగిత్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని మహిళా సాధికారత కో–ఆర్డినేటర్ అశ్విని అన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ఉండాలని కోరారు. షీటీం ఏఎస్సై బేగ్ మాట్లాడుతూ పోకిరీల నుంచి, సన్నిహితులుగా నటిస్తున్న వారి నుంచి ఎలా రక్షించుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలియా మక్సూద్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ తిరుపతిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

### టీచర్ల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి

సారంగాపూర్: ఉపాధ్యాయులకు పదోన్నతులపై పీఆర్‌టీయూ టీఎస్ నిరంతరం కృషి చేస్తుందని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమరనాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినిపెల్లి ఆనందరావు అన్నారు. బుధవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల్లో పీఆర్‌టీయూ కీలకపాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గోవర్ధన ప్రసాద్, నర్సింహమూర్తి, సత్యరాజ్, రాజగోపాల్, అనిల్‌కుమార్, అధ్యక్ష, కార్యదర్శులు శంకరయ్య, శ్రీధర్, కుమారస్వామి పాల్గొన్నారు.

**రుణమాఫీపై ప్రభుత్వం దాటవేత ధోరణి**

సారంగాపూర్: రైతులకు రూ.2 లక్షల రుణం ఏకకాలంలో మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ విషయంపై దాటవేత ధోరణి అవలంబిస్తుందని బీఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, సింగిల్ విండో మాజీ చైర్మన్ సాగి సత్యంరావు అన్నారు. బుధవారం సారంగాపూర్‌లో మాట్లాడారు. ప్రభుత్వం రుణమాఫీకి భిన్న ప్రకటనలు చేయడంతో రూ. 1లక్ష లోపు రుణమాఫీ అమలు విషయంలో సాంకేతి సమస్యలు ఏర్పడ్డాయన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 700 మందికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదని, దీనిపై గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

**ఈత చెట్లు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు**

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలోఉపాధిహామీ పథకంలో గీత కార్మికుల కోసం నాటిన 150 ఈత, తాటిచెట్లను తొలగించిన మోరపల్లి గ్రామానికి చెందిన పత్తిరెడ్డి తిరుపతిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. గీత కార్మికులు, ఎంపీడీవో రమాదేవి, ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్‌కు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**మున్సిపాలిటీలో వేలం పాట**

ధర్మపురి: మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వేలం పాట నిర్వహించారు. కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి 2024–25 మార్చి వరకుపశువుల సంత వేలం వేయగా బండారు సత్తన్న రూ.15 వేలకు దక్కించుకున్నాడు. వార సంతకు వేలం పాట నిర్వహించగా మూటపెల్లి రాజేందర్ 2,10.000 రూ.లకు సొంతం చేసుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

**కుర్సెంగ రామయ్య వర్ధంతి**

రాయికల్: పట్టణంలోని కొమురంభీం విగ్రహం వద్ద కుర్సెంగ రామయ్య వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ దళిత పోరాట హక్కుల సమితి అధ్యక్షుడు కుర్సెంగ వేణు, నాయకులు రవీందర్, ఆత్రం శేఖర్, పాల్గొన్నారు.

**దరఖాస్తుల ఆహ్వానం**

ధర్మపురి: ధర్మపురి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆర్‌సీవో మోనినీ అంజలి, కళాశాల ప్రిన్సిపాల్ రాధాకిషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిలో బీఏ (ఈపిహెచ్), బీ.కాం (సీఎ), బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఎస్సీ(బీజెడ్సీ) ఇంగ్లిష్ మీడియం కోర్సులలో ప్రవేశములకు. అర్హులైన విద్యార్థులు ఈనెల 31 లోగ ఒరిజనల్ ధృవపత్రాలతో కళాశాలలో చేరవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 8121149717, 817947798 నంబర్లను సంప్రదించాలని కోరారు.

**ఆటో ఢీకొని మహిళకు తీవ్రగాయాలు**

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో నడుచుకుంటూ వెళ్తున్న మహిళను ఆటో ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన బోరె గంగు జగిత్యాల పాతబస్టాండ్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొనడంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.


**రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు**

సారంగాపూర్:మండలంలోని అర్పపల్లిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌హెచ్‌వో అహ్మద్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గెంటె మలయ్య, ఆయన భార్య గంగవ్వ ధర్మపురికి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. గ్రామంలోని పోస్టాఫీస్ సమీపంలో బుగ్గారం గ్రామానికి చెందిన నక్క చంద్రమౌళి తన టాటా మ్యాజిక్ ఆటోతో దంపతులను ఢీకొట్టాడు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జగిత్యాలకు తరలించారు. బాధితుల కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు చంద్రమౌళిపై కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## కార్యదర్శుల బదిలీ

రాయికల్: మండలంలోని 11 మంది కార్యదర్శులు వివిధ గ్రామాలకు బదిలీ అయినట్లు ఎంపీడీవో బుధవారం తెలిపారు. ప్రవీణ్‌కుమార్ ధర్మాజీపేట నుంచి మేడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట, రాజేశ్ ఇటిక్యాల నుంచి కుమ్మరిపల్లి, కవిత ఒడ్డెలింగాపూర్ నుంచి శ్రీరాంనగర్, రమ్యకృష్ణ శ్రీరాంనగర్ నుంచి ఆలూరు, రాజేశ్‌కుమార్ కట్కాపూర్ నుంచి ఇటిక్యాల, రాజశ్రీ ఆలూరు నుంచి కట్కాపూర్, గీతారాణి కుమ్మరిపల్లి నుంచి దావన్‌పల్లి, రాజేశ్ వస్తాపూర్ నుంచి కొత్తపేట, అశోక్ జగన్నాథపూర్ నుంచి మల్లాపూర్ మండలం చిట్టాపూర్, విజయ్ దావన్‌పల్లి నుంచి మేడిపల్లి మండలం రంగాపూర్, మౌనిక కొత్తపేట నుంచి జగన్నాథపూర్ బదిలీ అయినట్లు తెలిపారు.

## ఎంపీలకు చీరలు, గాజులు, మాస్కులు



ఇబ్రహీంపట్నం: కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఎదురించలేని తెలంగాణ ఎంపీలు చీర, గాజులు, నల్లమాస్కులు ధరించి పార్లమెంట్‌లో నిరసన తెలపాలని కోరుతూ బుధవారం మండలంలోని ఎర్దండి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ బట్టు శేఖర్ వినూత్నరీతిలో నిరసన తెలిపాడు. ఎంపీలకు చీరలు, గాజులు, నల్లనిమాస్కులను రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించాడు. రాష్ట్రానికి ఒక్క రూపాయి కేటాయించకున్నా.. తెలంగాణలోని 17 మంది ఎంపీలు కనీసం నిరసన కూడా తెలపలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. మళ్లీ నిర్వహించే పార్లమెంట్ సమావేశంలో చీరలు కట్టుకుని, గాజులు వేసుకుని, నల్ల మాస్కులు ధరించి తెలంగాణపై కేంద్రం మొండి వైఖరిని నిలదీయాలని కోరాడు.



### గోరింటాకు వేడుకలు

జగిత్యాలజోన్: జగిత్యాలలోని న్యాయవాదుల సతీమణులు బుధవారం గోరింటాకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆషాడమాసం సందర్భంగా మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకుని, ఆడుతూ, పాడుతూ ఆనందంగా జరుపుకున్నారు.



### కేటీఆర్ జన్మదిన వేడుకలు

జగిత్యాల/రాయికల్/ఇబ్రహీంపట్నం/సారంగాపూర్/మల్లాపూర్/మేడిపల్లి/మల్యాల: మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. పట్టణాలు, వివిధ మండలాలు, గ్రామాల్లో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేకులు కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, యూత్, విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

## మడేలేశ్వర వీరమ్మ బోనాలు



జగిత్యాలటౌన్: పట్టణంలోని రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీమడేలేశ్వరస్వామి వీరమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. జగిత్యాల టవర్ సర్కిల్ మీదుగా మడేలేశ్వరస్వామి ఆలయం వరకు సాగిన బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

**ఘనంగా పోచమ్మ బోనాలు**



బోనమెత్తిన సరస్వతీ శిశుమందిర్ విద్యార్థినులు

కోరుట్ల: పట్టణంలోని నాయీ బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు, శ్రీ సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు బుదవారం పోచమ్మకు బోనాలు సమర్పించారు. బోనాలను ఊరేగింపుగా తీసుకవెళ్లి పోచమ్మ తల్లికి నైవేద్యంగా సమర్పించారు. సరస్వతీ శిశుమందిర్ విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మహాలక్ష్మి బోనాలు..**

మెట్‌పల్లి: పట్టణంలో ఆషాడంలో నిర్వహించే మహాలక్ష్మి బోనాల ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు కుల సంఘాలు బోనాలతో ఊరేగింపుగా శివారులో ఉన్న ఆలయానికి తరలివెళ్లి, ప్రత్యేక పూజలు చేసి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, నాయకులు పూజలు చేశారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

రాయికల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల అమలులో విఫలమైందని, ప్రభుత్వంపై ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్నాల తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రాయికల్ పట్టణంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, నాయకులు ముత్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మహిపతిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కుంబోజి రవి, వాసం రమ పాల్గొన్నారు.

**ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు**

మల్యాల: ప్రధానమంత్రి నరేంద్రమోదీపై సామాజిక మాధ్యమంలో అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామన్నపేటకు చెందిన వ్యక్తి సోషల్ మీడియాలో ప్రధాని పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మండల బీజేపీ నాయకులు ఎస్సై నరేశ్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

**తుంగూర్‌లో ఒకరిపై కుక్కల దాడి**

సారంగాపూర్:బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో బుధవారం ఒకరిపై కుక్కలు దాడి చేశాయి. గ్రామానికి చెందిన మ్యాడ సత్తయ్య రోడ్డు వెంట వెళ్తుండగా కుక్కలు దాడిచేశాయి. సత్తయ్యను సారంగాపూర్ పీహెచ్‌సీలో చికిత్స చేశారు.

**అసంఘటిత కార్మికులకు రక్షణ కల్పించాలి**

జగిత్యాల: అసంఘటిత కార్మికులకు రక్షణ కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు లేబర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సెస్ శాతం నుంచి 2 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. రాంబాబు, దేవదాసు పాల్గొన్నారు.

**డెంగీ బాధితుల ఇళ్ల పరిశీలన**

మెట్‌పల్లి:పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు డెంగీ జ్వరం బారిన పడ్డారు. సమాచారం అందుకున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, కమిషనర్ మోహన్ బుధవారం తమ సిబ్బందితో కలిసి బాధితుల ఇళ్లను పరిశీలించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆయా పరిసరాల్లో దోమల మందును పిచికారీ చేశారు. ముగ్గురిలో ఇద్దరు జ్వరంతో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చారని, ప్రజలు ఆందోళనా చెందవద్దని తెలిపారు.